నేడు చెన్నై సమీపానికి ఫెంగల్



● శనివారం తీరం దాటే అవకాశం

● పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు
● వాతావరణ శాఖ హెచ్చరిక ● అల్లకల్లోలంగా సముద్రం
● ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు

అడయార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి తీవ్ర తుఫానుగా రూపాంతరం చెందే అవకాశం ఉందని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది. 'ఫెంగల్' అనే ఈ తుఫాను ప్రభావం కారణంగా తమిళనాడులోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ముఖ్యంగా తుఫాను గురువారం రాత్రి చెన్నై సమీపంలోకి రావొచ్చని, శనివారం చెన్నై - పుదుచ్చేరి మధ్య తీరం దాటవచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఇది బుధవారం సాయంత్రానికి నాగపట్టణానికి 370 కిలోమీటర్లు, చెన్నైకి 550 కిమీ, పుదుచ్చేరికి 470 కిలోమీటర్ల ఆగ్నేయ దిశగా కేంద్రీకృతమై వుంది. దీని ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈ తుఫాను ఉత్తర వాయువ్య దిశగా గంటకు 13 కిలోమీటర్ల వేగంతో కదులుతోందని వాతావారణ శాఖ తెలిపింది. ఇది గురువారం రాత్రి లేదా శుక్రవారం ఉదయానికి చెన్నై సమీపానికి రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ తుఫాను తీరం దాటే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, కొన్ని సమయాల్లో గంటకు 60 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ కారణంగా చెన్నై, కడలూరు, పుదుచ్చేరి, మైలాడుదుర్రై, నాగపట్టణం, తిరువారూర్, తిరువళ్ళూరు, కాంచీపురం, చెంగల్పట్టు సహా 25 జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించారు. ఇదిలా వుండగా రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి కురిసిన వర్షాల కారణంగా డెల్టా జిల్లాల్లో 55 వేల ఎకరాల్లో పంట నీటమునిగింది.



తీరానికి వచ్చిన ఫ్లోటింగ్ బోట్

బంగాళాఖాతంలో భారత నావికా దళం ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బోట్ ఒకటి తీరానికి కొట్టుకుని వచ్చింది. సముద్రంలో వచ్చే స్వదేశీ, విదేశీ నౌకల రాకపోకలు సూచికలుగా ఈ ఫ్లోటింగ్ బోట్‌లు పనిచేస్తాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా సముద్రం ఉగ్రరూపం దాల్చడంతో ఫ్లోటింగ్ బోట్ తీరానికి కొట్టుకొచ్చింది.

చెన్నై నగర వాసులను భయపెడుతున్న ఈ తుఫాను తీరానికి చేరేలోగా బలహీనపడే సూచనలున్నాయని అధికారులు పేర్కొన్నారు.

18 వేల మంది పోలీసులు సిద్ధం


రాజధాని నగరాన్ని తుఫాను తాకితే తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు 18 వేల మంది పోలీసులను సిద్ధం చేశారు. అలాగే, నగర వ్యాప్తంగా 35 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.

12 జాతీయ విపత్తు నిర్వహణ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. చెన్నై నగరంలోని 12 డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో ఒక ఎన్డీఆర్ఎఫ్ బృందం తరపున 12 సహాయక బృందాలను సిద్ధంగా ఉంచారు. నగర వ్యాప్తంగా 35 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి 24 గంటల పాటు పనిచేసేలా సిబ్బందిని నియమించారు. అలాగే, 800 అగ్నిమాపకదళ ఇబ్బందిని కూడా అప్రమత్తం చేశారు.

చెన్నై - పుదువై మధ్య...

ఈ తుఫాను మొదట చెన్నై - నాగపట్టణం ప్రాంతాల మధ్య తీరం దాటొచ్చని అంచనా వేయగా, ప్రస్తుతం ఈ తుఫాను దిశ మారడంతో చెన్నై - పుదుచ్చేరి మధ్య తీరం దాటవచ్చని భావిస్తున్నారు. ఈ తుఫాను ప్రభావం కారణం గా 25 జిల్లాల్లో రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావారణ శాఖ తెలిపింది. ముఖ్యంగా ఈ నెల 29, 30వ తేదీల్లో అతి భారీ వర్షాలు కురవచ్చని తెలిపింది.


రామేశ్వరం జిల్లా సేరన్‌కోట్టై వద్ద కోసుకు పోయిన తీరం


ఎన్నూరు వద్ద ఎగసిపడుతున్న అలలు

అల్లకల్లోలంగా సముద్రం

తుఫాను ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా వుంది. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు తీర ప్రాంత వాసులను భయపెడుతున్నాయి. సాధారణంగా పౌర్ణమి, అమావాస్య సమయాల్లో అలల తీవ్రత అధికంగా ఉంటుంది. అయితే, తుఫాను ప్రభావంతో అలలు ఐదడుగుల ఎత్తుకుపైగా ఎగిసిపడుతున్నాయి. దీంతో తీర ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని, జాలర్లు సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళొద్దని వాతావారణ శాఖ అధికారులు సూచించారు. అలాగే, కోస్తాతీర జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

పరీక్షల వాయిదా...

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పలు విశ్వవిద్యాలయాల పరిధిలో బుధవారం జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు. మద్రాసు విశ్వవిద్యాలయం, కారైక్కుడి అళగప్పా వర్సిటీల పరిధిలో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు. ఈ పరీక్షలను మళ్ళీ ఎపుడు నిర్వహించేది తర్వాత వెల్లడిస్తామని ఆయా వర్శిటీల పరీక్షల నిర్వహణాధికారులు పేర్కొన్నారు.

ఊటీ చేరుకున్న రాష్ట్రపతి

● స్వాగతం పలికిన గవర్నర్, మంత్రులు, అధికారులు


ఊటీలో రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న గవర్నర్ ఆర్ఎన్ రవి, మంత్రి శివ మెయ్యనాథన్

చెన్నై, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం నీలగిరి జిల్లా ఊటీ చేరుకున్నారు. ఆమెకు గవర్నర్ ఆర్ఎన్ రవి, మంత్రి శివ వి.మెయ్యనాథన్ తదితరులు సాదర స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానం లో కోయంబత్తూర్ విమానాశ్రయానికి ఉదయం 9.15 గంటలకు చేరుకున్న రాష్ట్రపతికి మంత్రి శివ.వి.మెయ్యనాథన్, కలెక్టర్ క్రాంతికుమార్ పాడి, పోలీస్ కమిషనర్ వి.బాలకృష్ణన్, ఎస్పీ కార్తికేయన్, త్రివిధ దళాలధిపతులు స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి కోవై విమానాశ్రయం నుంచి సైనిక హెలికాప్టర్‌తో ఊటీకి వెళ్లేందుకు తొలుత అధికారులు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. అయితే దట్టమైన పొగమంచు కారణంగా హెలికాప్టర్ ప్రయాణం సురక్షితం కాదని తేల్చిన అధికారులు.. రోడ్డుమార్గాన్ని ఎంచుకున్నారు. దాంతో రాష్ట్రపతి కోవై విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో నీలగిరి జిల్లా ఊటీకి చేరుకున్నారు. అక్కడ గవర్నర్ ఆర్ఎన్ రవి, మంత్రి శివమెయ్యనాథన్ సహా పలువురు అధికారులు రాష్ట్రపతికి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి ఊటీ రాజ్‌భవన్‌కు చేరుకుని, రాత్రికి అక్కడే బసచేయనున్నారు. మూడు రోజులు ఊటీ రాజ్‌భవన్‌లో బసచేయనున్న రాష్ట్రపతి గురువారం వెల్లింగ్టన్ సైనిక శిక్షణా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 29వ తేది గిరిజనులు, ఆదివాసీయులను రాష్ట్రపతి కలుసుకోనున్నారు. 30వ తేదీ తిరువారూర్ కేంద్ర విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పాల్గొని, అదేరోజు ఆమె ఢిల్లీ వెళ్తారు.

15న అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం



చెన్నై, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే కార్యనిర్వాహక, సర్వసభ్య సమావేశాలు డిసెంబరు 15వ తేది జరుగున్నాయి. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) బుధవారం ప్రకటన విడుదల చేశారు. వానగరంలోని శ్రీవారు వెంకటాచలపతి ప్యాలెస్‌లో పార్టీ ప్రిసీడియం చైర్మెన్ తమిళ్‌మగన్ హుస్సేన్ అధ్యక్షతన సమావేశాలు జరుగనున్నాయి. దీని కోసం పార్టీ కార్యనిర్వాహక సభ్యులు, సర్వసభ్య మండలి ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులకు ఇప్పటికే ఆహ్వానాలు కూడా పంపించారు. ఈ సమావేశాలకు హాజరయ్యేవారు తప్పనిసరిగా ఆహ్వానపత్రాలు కూడా తీసుకురావాలనే నిబంధన విధించారు. పార్టీ బహిష్కృతులైన ఓపీఎస్, శశికళ వర్గాల నేతలతో సమస్యలు ఎదురయ్యే అవకాశముండడంతో ఈ నిబంధన విధించారు. 2026లో అసెంబ్లీ ఎన్నికలకు నేతల్ని సన్నద్ధం చేసేందుకు ఇప్పటికే ఈపీఎస్ ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో, డిసెంబరు 15న జరుగనున్న కార్యనిర్వాహక, సర్వసభ్య మండలి సమావేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఎన్నికలకు సంబంధించి వ్యూహాలు, కూటమి తదితరాలపై సమావేశంలో తీర్మానం చేయనున్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామి ఎంపికైన అనంతరం, ఆయన ఫొటోతో కూడిన సభ్యత్వ కార్డులు అందజేశారు. కానీ, ఈ గుర్తింపుకార్డులు సక్రమంగా అందలేదని కార్యకర్తల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ జిల్లాల వారీగా ప్రత్యేక కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. ఆ మేరకు సర్వసభ్య సమావేశానికి ముందే ఆయా కమిటీలు నివేదికలు అందించేందుకు కసరత్తు చేస్తున్నాయి.

ఘనంగా ఉదయనిధి జన్మదినం

● శుభాకాంక్షల వెల్లువ ● క్యూ కట్టిన మంత్రులు, కార్యకర్తలు

అడయార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, డీఎంకే యువజన విభాగ అధ్యక్షుడు ఉదయనిధి 47వ జన్మదినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రులు, పార్టీ నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఆయన ఆళ్వార్‌పేట చిత్తరంజన్ దాస్‌సాలైలో ఉన్న తన తల్లిదండ్రులు, ముఖ్యమంత్రి స్టాలిన్, దుర్గా దంపతులను కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం మెరీనా తీరంలో ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధిని సందర్శించి నివాళులర్పించారు. తర్వాత పక్కనే ఉన్న అన్నా సమాధికి నివాళులర్పించారు. ఉదయనిధి వెంట మంత్రులు పీకే శేఖర్‌బాబు, స్వామినాథన్, ఎంపీ దయానిధి మారన్, నగర మేయర్ ఆర్.ప్రియ, జిల్లా కార్యదర్శి చిత్రరసు, పలువురు ఎమ్మెల్యేలున్నారు. అనంతరం పెరియార్ గ్రౌండ్‌కు చేరుకుని పెరియార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడ మంత్రి శేఖర్‌బాబు నేతృత్వంలో ఘన స్వాగతం లభించింది. అనంతరం గోపాలపురం చేరుకుని కలైంజర్ విగ్రహానికి పూలమాల వేసి, కరుణానిధి సతీమణి దయాళు అమ్మాళ్ ఆశీస్సులు, సీఐటీ కాలనీకి వెళ్లి కరుణ సతీమణి రాజాత్తి అమ్మాళ్ అశీస్సులు అందుకున్నారు. అడయారులోని ప్రభుత్వ అతిధి గృహం కురుంజికి చేరుకోగా కార్యకర్తలు స్వాగతం పలికారు. మంత్రులు అన్బరసన్, పొన్ముడి, పన్నీర్‌సెలం, సుబ్రమణ్యం, తంగం తెన్నరసు, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ఆవడి నాజర్, శివ శంకర్, పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ఎస్ భారతి, పూచ్చి మురుగన్, హార్బర్ రాజా, జిల్లా కార్యదర్శులు, కార్యకర్తలు ఉదయనిధికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, సినీ నటుడు సత్యరాజ్, కమల్ హాసన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, సమత్తువ మక్కల్ కట్చి అధ్యక్షుడు ఎర్నావూర్ నారాయణన్ తదితరులు కూడా ఉదయనిధికి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.


స్టాలిన్ దంపతుల పుత్రోత్సాహం

నేర రహిత రాష్ట్రమే లక్ష్యం

● నియామక ఉత్తర్వుల కార్యక్రమంలో సీఎం స్టాలిన్

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో మర్యాదగా వ్యవహరించి నేరాలు జరగకుండా చూడాలని, నేరరహిత రాష్ట్రమే లక్ష్యంగా పాటు పడాలని ముఖ్యమంత్రి స్టాలిన్ కొత్తగా పోలీసు ఉద్యోగాలకు ఎంపికైనవారికి పిలుపునిచ్చారు. రాష్ట్ర పోలీసు, అగ్నిమాపక, జైళ్ల శాఖలకు యూనిఫాం ఉద్యోగుల ఎంపిక కమిషన్ ద్వారా ఎంపికైన 3,359 మంది సెకండరీ గ్రేడ్ పోలీసులకు బుధవారం కలైవానర్ ఆడిటోరియంలో సీఎం నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

ఉద్యోగ నియామకాలు పొందిన వారు నిజాయితీగా, సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. డీఎంకే హయాంలోనే తొలి పోలీస్ కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. మూడేళ్లలో 17వేల మంది పోలీసులను నియమించామని, డీఎంకే పాలన పోలీసులకు స్వర్ణయుగమని పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల చెలామణి, మహిళలపై వేధింపులు వంటివి అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయ దృక్పథం, లౌకికవాదం తదితరాలను ఖచ్చితంగా పాటించాలని, కుల వివక్ష చూడొద్దన్నారు. ప్రస్తుతం ఉద్యోగాలకు ఎంపికైనవారు విధుల్లో ప్రతిభ చూపితే భవిష్యత్తులో తన చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్నారన్నారు. ఆధునిక యుగానికి అనుగుణంగా సాంకేతికత అందిపుచ్చుకొని విధుల్లో రాణించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో న్యాయశాఖ మంత్రి ఎస్.రఘుపతి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, హోంశాఖ కార్యదర్శి ధీరజ్‌కుమార్, డీజీపీ శంకర్ జివాల్ తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన వారితో సీఎం స్టాలిన్ సహా మంత్రులు, అధికారులు

త్రిష మాటల్లో మర్మమేంటి?

రివ్యూలపై సముచిత నిర్ణయం తీసుకోవాలి
నిర్మాత సురేష్ కామాక్షి
7లో..

ఐదుగురిని బలిగొన్న మద్యం మత్తు

● గొర్రెల కాపరులపైకి దూసుకెళ్లిన కారు
● మహిళల దుర్మరణం ● మహాబలిపురం సమీపంలో ఘటన

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి మద్యం మత్తు ఐదుగురిని బలిగొంది. మద్యం మత్తులో ఏం చేస్తున్నాడో తెలియని స్థితిలో యువకుడు నడిపిన కారు ఐదుగురి ప్రాణాలను హరించి వేసింది. పొట్టకూటి కోసం గొర్రెల కాపలాకు వెళ్లి, మధ్యాహ్నం రోడ్డు పక్కన చెట్టు కింద సేదతీరుతుండగా, హఠాత్తుగా దూసుకొచ్చిన కారు వారందరినీ మృత్యుఒడిలోకి నెట్టేసింది. చెంగల్పట్టు జిల్లా తిరుప్పోరూర్ సమీపంలోని పండిమేడు వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ దుర్ఘటన వివరాలిలా వున్నాయి... పండితమేడు ప్రాంతానికి చెందిన గొర్రెల కాపరులు బుధవారం పశువులను మేతకు తోలుకెళ్లారు. వారు మధ్యాహ్నం రోడ్డు పక్కన కూర్చొని సేదతీరుతుండగా, చెన్నై నుంచి మహాబలిపురం వైపు వెళ్తున్న కారు కూర్చునివున్న వారిపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఐదుగురు మహిళలు అక్కడికక్కడే మృతిచెందారు. కారు అతి వేగంగా రావడంతో మృతదేహాలను కొద్ది దూరం వరకు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన చుట్టుపక్కల వారు.. హుటాహుటిన అక్కడకు చేరుకుని కారు డ్రైవింగ్ చేసిన యువకుడిని, అతని వెంట వున్న మరో యువకుడిని చితకబాదారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని యువకులను అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో... మృతులు పండితమేడు ప్రాంతానికి చెందిన వారుగా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా కారు డ్రైవింగ్ చేసిన యువకులు మద్యం మత్తులో వున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనను ఖండిస్తూ గ్రామస్తులు రోడ్డురోకో చేపట్టారు. ఆ యువకులను తమకు అప్పగించాలంటూ పోలీసు వాహనాన్ని చుట్టుముట్టారు. దీంతో, జిల్లా ఎస్పీ అక్కడకు చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేశారు. ఇదిలా వుండగా దుర్ఘటన పట్ల తీవ్ర సంతాపం ప్రకటించిన సీఎం స్టాలిన్.. మృతుల కుటుంబాలకు తలా రూ.2లక్షల చొప్పున పరిహారం అందజేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.




మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు - ప్రమాదానికి కారణమైన కారు

సమాచార దర్శిని

తెలుగు పీపుల్ సొసైటీ ఆధ్వర్యంలో 1న కార్తీక వన మహోత్సవం

చెన్నై, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు తెలుగు పీపుల్ సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబరు 1వ తేదీ కార్తీక వనభోజన మహోత్సవం జరుగనుంది. పడప్పై సెలబ్రిటీ రిసార్ట్స్‌లో జరుగనున్న ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు, పెద్దలకు సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనదలచిన ఔత్సాహికులు ముందుగా 9962469996, 9940423688 మొబైల్ నెంబర్లకు సంప్రదించాలని సొసైటీ వ్యవస్థాపకులు దేవరకొండ రాజు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు మూడు రోజుల ఆన్‌లైన్ శిక్షణ

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థుల ప్రతిభ గుర్తించి, వారికి అవసరమైన మార్గదర్శకాలు బోధించేలా ఉపాధ్యాయులకు మద్రాసు ఐఐటీ, ప్రవర్తక్ సంస్థలు సంయుక్తంగా ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నాయి. దేశవ్యాప్తంగా 5,000 పాఠశాలలకు చెందిన 10,000 మంది ఉపాధ్యాయులకు మూడు రోజులు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు https://bodhbridge.iitmpravartak.org.in అనే వెబ్‌సైట్‌లో డిసెంబరు 12వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రవర్తక్ సంస్థ సలహాదారులు బాలమురళి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఒమన్‌లో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒమన్ దేశంలో 'ఇండస్ట్రీ బ్యాగ్రౌండ్', 'ఎలక్ట్రికల్ మెయింటెన్స్' తదితర ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. టెన్త్, ప్లస్ టూ, ఐటీఐ ఉత్తీర్ణులై రెండేళ్ల అనుభవం కలిగిన వారు www.omcmanpower.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే, ovemclnm@gmail.com అనే ఈ-మెయిల్‌కు స్వీయవివరాలతో కూడిన దరఖాస్తు, విద్య, పని అనుభవం సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ నకలు తదితరాలను డిసెంబరు 10వ తేది లోగా సమర్పించాలి. ఎంపిక చేసిన అభ్యర్థులకు నెలకు రూ.35,000 నుంచి రూ.40,000 వేతనం అందించనున్నారు.

పెరిగిన పూల ధరలు

వేళచ్చేరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్లో పూల ధరలు పెరిగాయి. ప్రతిరోజూ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఈ మార్కెట్‌కు రకరకాల పూలు దిగుమతవుతాయి. ప్రస్తుతం ప్రత్యేక పూజలు, వివాహ ముహూర్తాలు పెద్దగా లేనప్పటికీ గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో పూల దిగుబడి తగ్గింది. దీంతో పూలధరలు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. కిలో మల్లెలు రూ.900-రూ.1000, జాజిమల్లె రూ.900 - రూ.1000, కనకాంబరాలు రూ.800 - రూ.1000, చామంతి రూ.250-రూ.400 చొప్పున ధర పలుకుతున్నట్లు తెలిపారు.

ఏవీఎం శ్మశానవాటిక మూసివేత

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కం మండలం 135వ వార్డు పరిధిలోని ఏవీఎం శ్మశానవాటికలో మరమ్మతుల కారణంగా బుధవారం నుంచి డిసెంబరు 26వ తేది వరకు మూసివేయనున్నారు. ఆ సమయంలో నెసపాక్కం, కన్నమ్మపేట శ్మశానవాటికలను ప్రజలు వినియోగించుకోవాలని కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోలింగనల్లూర్, పల్లావరం మండలాల పరిధిలో గురువారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. పల్లావరం సబ్‌స్టేషన్ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే శిబిరంలో విద్యుత్ వినియోగదారులు పాల్గొని కొత్త కనెక్షన్లు, మీటర్ల మరమ్మతులు, విద్యుత్ కోతలు సహా పలుకు పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

5న జయకు ఈపీఎస్ నివాళి

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జయలలిత 5వ వర్ధంతిని పురస్కరించుకొని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మెరీనా తీరంలోని ఆమె స్మారక మందిరం వద్ద నివాళులర్పించనున్నారు. ఉదయం 10 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు, జిల్లా కార్యదర్శులు, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని అన్నాడీఎంకే కార్యాలయం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది.

కొత్త అంశాలతో ప్రభుత్వ వెబ్‌సైట్

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అధికార వెబ్‌సైట్ కొత్త అంశాలతో రూపుదిద్దుకుంది. ఆ ప్రకారం, tn.gov.in అనే తమిళనాడు ప్రభుత్వ వెబ్‌సైట్ హోమ్ పేజీ మాత్రమే కాకుండా పూర్తిగా నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ద్వారా పూర్తిగా నవీకరించారు. శాఖల వారీగా ఆర్డినెన్స్‌లు, పాలసీ నోట్, కొత్త నోటిఫికేషన్లు, చట్టబద్ధమైన నిబంధనలు తమిళం, ఆంగ్లంలో అందుబాటులో ఉన్నాయి. తాజా ఫీచర్‌గా, ముఖ్యమంత్రి ప్రచురించిన సోషల్ మీడియా పోస్టులు తక్షణమే ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ కానున్నాయి. ప్రభుత్వం అమలుచేస్తున్న పైలెట్ పథకాల ద్వారా లబ్ధిపొందిన లబ్దిదారుల సంఖ్య, వివరాలు కూడా చోటుచేసుకున్నాయి. అలాగే, మంత్రివర్గం, ప్రభుత్వ శాఖలు, జిల్లాలు, ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలు,వార్తలు, ప్రభుత్వ ప్రకటనలు, ఉపాధికి సంబంధించిన వివరాలు కూడా వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

బండి కాదు...మొండి ఇది...

సాయం పట్టండి

● తిరుప్పూర్‌లో పాత బస్సులతో విద్యార్థుల పాట్లు



బస్సును తోస్తున్న విద్యార్థులు

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాలపరిమితి చెందిన, పైకప్పులు ఊడిన, ఎప్పుడు పడతాయో తెలియని ఫుట్ బోర్డుతో ప్రభుత్వ బస్సులు నడుపుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అందుకు నిదర్శంగా తిరుప్పూర్ పాత బస్టాండ్‌లో మంగళవారం ఓ ఘటన చోటుచేసుకుంది. ఈ బస్టాండ్ నుంచి ఉదయం, సాయంత్రం బస్సుల్లో అధికంగా విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. ఆ ప్రకారం, మంగళవారం సాయంత్రం కిక్కిరిన ప్రయాణికులతో వెళుతున్న ప్రభుత్వ సీటీ బస్సు కుమరన్ రోడ్డు వలర్మతి వంతెనపై రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. బస్సు ఎంతకీ స్టార్ట్ కావకపోవడంతో ప్రయాణికులు బస్సు దిగి ఇతర వాహనాల్లో తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. కాగా, డ్రైవర్, కండక్టర్ అభ్యర్థనతో విద్యార్థులు బస్సును నెడుతూ రోడ్డు పక్కకు తీసుకెళ్లారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడి వైరల్‌గా మారాయి.

వేతనం పెంపుపై త్వరలో చర్చలు

● రవాణా శాఖ

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రవాణా శాఖలో ఉద్యోగుల వేతనం పెంపుపై డిసెంబరు రెండో వారంలో చర్చలు జరుపనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. రవాణా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, పదవీవిరమణ చేసినవారి తరఫున ఆయా కార్మిక సంఘాలు ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నాయి. తమ డిమాండ్లతో రవాణా శాఖ కార్యదర్శి ఫణీంధర్ రెడ్డికి రవాణా సంఘాల ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో, రవాణా కార్మికులకు సంబంధించిన వేతనం పెంపుపై డిసెంబరు రెండో వారంలో తన అధ్యక్షతన చర్చలు జరుగుతాయని, డ్రైవర్, కండక్టర్ నియామకాలకు సంబంధించిన సమస్యలపై చర్చించనున్నట్లు ఫణీంధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మాదకద్రవ్యాల విక్రయం...

ఐటీ ఉద్యోగి అరెస్ట్

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కంలో మెతాబెటామిన్ అనే మాదకద్రవ్యాన్ని విక్రయించిన ఓ ఐటీ ఉద్యోగిని అరెస్ట్ చేశారు. విల్లివాక్కం జగన్నాథ నగర్‌కు చెందిన సురేందర్ అన్నానగర్‌లోని ఓ ఐటీ కంపెనీలో పనిచేస్తూ, ఆన్‌లైన్ ద్వారా మెతాబెటామిన్ అనే మాదకద్రవ్యాన్ని విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం సాయంత్రం సురేందర్‌కు పోలీసులు ఫోన్‌చేసి తమకు మెతాబెటామిన్ కావాలని కోరారు. దీంతో, పోలీసులు చెప్పిన ప్రాంతానికి మాదకద్రవ్యంతో వచ్చిన సురేందర్‌ను అరెస్ట్ చేశారు. అతడిని విచారించగా.. కృష్ణగిరి జిల్లా హోసూరులో ఉన్న సంజయ్ అనే వ్యక్తి నుంచి మెతాబెటామిన్ కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు తెలిసింది.

జామ్ బజార్‌లో మహిళ అరెస్ట్...

ట్రిప్లికేన్ జామ్ బజార్ ప్రాంతంలో మత్తు బిళ్లలు విక్రయించిన ముంతాజ్ అనే మహిళను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. జామ్ బజార్ వీరాపురం పకీర్‌సాహెబ్ వీధిలో ఉన్న ఓ ఇంట్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు, 20కి పైగా మత్తు బిళ్లలు స్వాధీనం చేసుకొని, ముంతాజ్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

మద్యం మత్తులో మహిళ వీరంగం


పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ మహిళ వీరంగం చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. కరూర్ బస్టాండ్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం 40 ఏళ్ల మహిళ మద్యం మత్తులో కేకలు వేస్తూ హడావుడి చేసింది. ఈ విషయమై చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని ఆ మహిళను విచారించారు. తిరుప్పూర్ జిల్లా పల్లడంకు చెందిన మహిళ అని, రూ.5 వేలు తీసుకొని తనను మోసం చేసిన వ్యక్తినుంచి నగదు ఇప్పించాలని కోరుతూ మద్యం మత్తులో రగడ చేసిందని విచారణలో తేలడంతో, పోలీసులు ఆమెను మహిళా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు.

రూ.300 కోట్లు స్వాహా కేసు...

దేవనాథన్ యాదవ్‌పై చర్యలు

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్ హిందూ పర్మినెంట్ ఫండ్ ఫైనాన్స్ సంస్థలో చందాదారులు డిపాజిట్ చేసిన రూ.300 కోట్లు స్వాహా చేసిన కేసులో ఆ సంస్థ డైరెక్టర్ దేవనాథన్ యాదవ్‌పై త్వరలోనే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు మద్రాసు హైకోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) బుధవారం అఫిడవిట్ దాఖలుచేసింది. మైలాపూర్‌లోని ఫైనాన్స్ సంస్థలో డిపాజిట్ చేసిన 145 మంది చందాదారులను మోసం చేసిన దేవనాథన్ యాదవ్, గుణశీలన్, సాల్మన్ మోహన్‌దాస్, మధుమైనాథన్, దేవసేనాధిపతి, సుధీర్ శంకర్‌లను ఆర్థికనేర విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో బాధితుల తరఫున సతీష్‌కుమార్ హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్ బుధవారం న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణియం, ఎం.జ్యోతిరామన్ బెంచ్ ముందు విచారణకు వచ్చింది. దేవనాథన్ ముఠా అవినీతికి సంబంధించి స్వాధీనం చేసుకున్న దస్త్రావేజుల పరిశీలన పూర్తి కాలేదని, త్వరలోనే దీనిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ ఈడీ తరపు ప్రత్యేక న్యాయవాది ఎన్.రమేష్ అఫిడవిట్ దాఖలుచేశారు.

లవంగాలు, యాలకులతో మాల



పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం సమీపం ఇడుకుంపాళయం గ్రామంలో ఉన్న జయమంగళం ఆంజనేయ స్వామి ఆలయానికి ప్రతిరోజు భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఆంజనేయ స్వామి యాలకులు, లవంగాలతో రూపొందించిన మాల కానుకగా ఇవ్వాలని ఓ భక్తుడు నిర్ణయించుకున్నాడు. ఆ ప్రకారం పూల దుకాణంలో 6 కిలోల యాలకులు, 7 కిలోల లవంగాలతో ఆ భక్తుడు మాల తయారుచేయించాడు. ఈ మాలను బుధవారం ఆలయ నిర్వాహకులకు అందజేసి స్వామివారికి అలంకరింపజేశారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

వేలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఇద్దరు మృతిచెందిన ఘటన వేలూరు జిల్లాలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వేపంకుప్పం ప్రాంతంలో విద్యుద్దీపాల కోసం తాత్కాలిక పంప్ ఆపరేటర్ ముత్తుకుమరన్ (47), అశోక్ (48) స్తంభం ఏర్పాటు చేస్తున్నారు. ఊహించని విధంగా స్తంభానికి విద్యుత్ లైన్ తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు గుర్తింపుకార్డులు



కోడంబాక్కం కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటుచేసిన శిబిరం

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఫుట్‌పాత్ వ్యాపారులకు క్యూఆర్ కోడ్, చిప్ అమర్చిన కొత్త గుర్తింపు కార్డులను చెన్నై కార్పొరేషన్ అందిస్తోంది. ఈ నెల 30వ తేది వరకు గుర్తింపుకార్డులు అందజేసే ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. కోడంబాక్కం మండల పరిధిలోని టి.నగర్, సైదాపేట, విరుగంబాక్కం ప్రాంతాలకు చెందిన ఫుట్ పాత్ వ్యాపారులకు ఆ ప్రాంతంలోని కమ్యూనిటీ హాల్‌లో గుర్తింపుకార్డులు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వ్యక్తి దారుణహత్య

● ఇద్దరి అరెస్టు

అడయార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా వానూర్ తాలూకా తిరువక్కరై గ్రామానికి చెందిన రాజాదురై (30)ని ఐదుగురు దారుణంగా హత్య చేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని ముక్కలు చేసి వేర్వేరు ప్రాంతాల్లో విసిరేసారు.. ఈ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు. రాజాదురై మొదటి భార్యను వదిలేసి 2012లో కస్తూరి అనే యువతిని రెండో వివాహం చేసుకుని ఆమెను కూడా వదిలేశాడు. ఆ తర్వాత మరో మహిళను మూడో పెళ్ళి చేసుకోగా, ఒక సంతానం ఉంది. అలాగే, తాను పనిచేసిన ఇటుక బట్టీలో ఉండే ఓ యువతిని గర్భవతిని చేసి అక్కడ నుంచి పారిపోయాడు. అదేవిధంగా గ్రామంలో పలువురు మహిళలతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. దీనికి తోడు గ్రామంలో పలువురితో గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో ఐదుగురి ముఠా రాజాదురైను హత్య చేయగా, ఈ నెల 23వ తేదీన గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుల మృతి

వేళచ్చేరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక తమ్మల్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కుమారులు సహా తల్లి మృత్యువాతపడ్డారు. తిరుపట్టుకుయిల్ ప్రాంతానికి చెందిన గజలక్ష్మి (40), కుమారులు మదన్ (20), మనోజ్ (18)తో కలసి ద్విచక్రవాహనంపై బయల్దేరింది. తమ్మల్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో ద్విచక్రవాహనాన్ని కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ఘటనలో గజలక్ష్మి, మదన్, మనోజ్‌లు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనపై బాలుచెట్టిసత్రం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

జైలులో భర్తకు గంజాయి.. భార్య అరెస్టు

అడయార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోర్టులో హాజరయ్యేందుకు వచ్చిన ఖైదీతో జైలులో ఉన్న భర్తకు గంజాయి ప్యాకెట్ పంపించిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఎర్నావూర్ సునామీ కాలనీకి చెందిన విజయ్ అనే వ్యక్తిని ఓ కేసులో పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. అయితే, ఓ కేసులో పుళల్ జైలులో ఉంటున్న తిరువొత్రియూరుకు చెందిన గంజాయి వ్యాపారి పృథ్విరాజ్, ఈయన భార్య జోస్నా, తాంబరంకు చెందిన భరత్‌లను తిరువొత్రియూరు కోర్టులో హాజరుపరిచేందుకు పోలీసులు తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న విజయ్ భార్య నందిని గంజాయి ప్యాకెట్లను జైలులో ఉన్న తన భర్తకు అందజేయాలని పృథ్విరాజ్‌కు ఇచ్చింది. ఈ విషయాన్ని ఖైదీల వెంట ఉన్న సాయుధ విభాగం పోలీసులు గుర్తించారు. దీంతో నందినితో పాటు ఆమెకు గంజాయి సరఫరా చేసిన రాజాజీ నగర్‌కు చెందిన మురళి, యోగేశ్వరన్ అనే వారిని అరెస్టు చేశారు.

మహారాష్ట్రలో పోటీ చేసిన వీసీకే

● 4 స్థానాల్లో 769 ఓట్లు

అడయార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో లోక్‌సభ సభ్యుడు తోల్ తిరుమావళవన్ సారథ్యంలోని వీసీకే నాలుగు స్థానాల్లో పోటీ చేయగా, 769 ఓట్లు పోలయ్యాయి. ఆ పార్టీ తరఫున ఔరంగాబాద్ (ఈస్ట్), పూలాంపురి, బింభిరి, బోగర్దాన్ స్థానాల్లో సానీల్ వాఘేకర్, రవి కిరణ్, కైలాష్, రాహుల్ మల్కరి పోటీ చేశారు. మిగిలిన 278 నియోజకవర్గాల్లో ఇండియా కూటమికి మద్దతు తెలిపారు. వీసీకే పోటీ చేసిన నాలుగు స్థానాల్లో మొత్తం 769 ఓట్లు పోలయ్యాయి. బోగర్దాన్ సెగ్మెంట్‌లో వీసీకే అభ్యర్థికి 105 ఓట్లు పోలుకాగా, ఔరంగాబాద్ (ఈస్ట్) స్థానంలో పోటీ చేసిన అభ్యర్థికి 57 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. పూలాంపురి స్థానంలో 256 ఓట్లు, బింభిరిలో 351 ఓట్లు వచ్చాయి. వీసీకే పోటీ చేసిన అన్ని నియోజకవర్గాల్లో నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.

మెట్రో రైల్ నిర్మాణ పనుల్లో జాప్యం

● నీట మునిగిన ఓఎంఆర్

అడయార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరింది. అదేసమయంలో మెట్రో రైల్ నిర్మాణ పనుల కోసం పలు చోట్ల తవ్వేశారు. దీంతో వర్షపునీరు సాఫీగా వెళ్ళేందుకు వీలులేకుండా పోవడంతో రోడ్లపై ప్రవహిస్తుంది. పాత మహాబలిపురం రోడ్డు వర్షం పడితే మునిగిపోతుంది. కందన్‌చావడి, పెరుంగుడి, అపోలో ఆస్పత్రి, దురైప్పాక్కం, షోళింగనల్లూరు తదితర ప్రాంతాల్లో ఓఎంఆర్ రహదారిపై మెట్రో రైల్ నిర్మాణ పనుల కారణంగా వర్షపునీరు నిలిచిపోతోంది. దీంతో వాహనదారులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెట్రో రైల్ నిర్మాణ పనులు నెమ్మదిగా సాగడం, వర్షపు నీరు వెళ్ళేందుకు సరైన కాల్వలు లేకపోవడం వల్లే రహదారిపై వర్షపునీరు నిలుస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులపై కూడా లైంగిక వేధింపులు

● మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో పాటు విద్యార్థులపై కూడా లైంగిక వేధింపులు జరుగుతున్నాయని సర్వేలో వెల్లడైందని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. చిన్నారుల లైంగిక వేధింపుల నియంత్రణ, అవగాహన ప్రచారోత్సవాల్లో భాగంగా ఎగ్మూర్‌లోని డాన్‌బాస్కో మహోన్నత పాఠశాలలో చెన్నై జిల్లాకు చెందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఒకరోజు సదస్సు మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి అన్బిల్ మహేష్ మాట్లాడుతూ... చిన్నారుల లైంగిక వేధింపులు అడ్డుకోవడం, అవగాహన కల్పిస్తున్నామన్నారు. పత్రికల్లో వస్తున్న వేధింపుల కథనాలకు భయపడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలో ఇలాంటి సదస్సులు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.

97 మంది పీఎంకే కార్యకర్తల అరెస్టు

అడయార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌ను అగౌరవపరిచేలా ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడారని ఆరోపిస్తూ పీఎంకే శ్రేణులు పలు ప్రాంతాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఇందులోభాగంగా బుధవారం నుంగంబాక్కం వళ్లువర్‌కూట్టం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో పీఎంకే నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. వీరంతా పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో ఆందోళనలో పాల్గొన్న వారిలో 97 మందిని అరెస్టు చేశారు. అలాగే, మద్రాస్ హైకోర్టులో కూడా ఆ పార్టీకి చెందిన న్యాయవాదులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారంతా సీఎం స్టాలిన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

వ్యభిచారం కేసులో మహిళ సహా ఇద్దరి అరెస్ట్

వేళచ్చేరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాలిగ్రామంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వ్యభిచారం సాగిస్తున్న మహిళ సహా ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వ్యభిచార నిరోధక విభాగం పోలీసులకు అందిన సమాచారంతో, సాలిగ్రామం వేలాయుధం కాలనీలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, అక్కడ వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో తిరువణ్ణామలై జిల్లా వీరలూరుకు చెందిన రాజేశ్వరన్, తిరువళ్లూర్ జిల్లా తేరడి నేతాజీ నగర్‌కు చెందిన మంజుల అలియాస్ సుమతిలను అరెస్ట్‌చేశారు. అలాగే, ఓ మహిళను ప్రభుత్వ హోంకు తరలించారు.

ఈసీఆర్‌లో బైక్ రేసింగ్

● వాహనాల స్వాధీనం

అడయార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈస్ట్ కోస్ట్ రోడ్డు (ఈసీఆర్), పాత మహాబలిపురం రహదారుల్లో బైక్ రేసింగ్‌కు పాల్పడుతున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా ఇలాంటివారిని గుర్తించి, ఏకంగా వంద బైకులను స్వాధీనం చేసుకున్నారు. ప్రధానంగా, శని, ఆదివారాల్లో బైక్ రేసింగ్‌లు చేస్తున్నట్టు స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. పైగా బైక్ రేసింగ్‌లకు పాల్పడే వారు కొన్ని సమయాల్లో ప్రమాదాలకు గురై మరణిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ బైక్ రేస్‌లను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టిన పోలీసులు.. వంద బైకులను స్వాధీనం చేసుకుని పలువురు రేసర్లపై కేసు నమోదు చేశారు.

2 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

వేళచ్చేరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ ప్రాక్టికల్ పరీక్షలు డిసెంబరు 2 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ తరగతుల సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన ప్రాక్టికల్స్ డిసెంబరు 2 నుంచి 6వ తేది లోపు ముగించాలని పాఠశాలలకు పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్ జారీచేసింది.

ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు





పల్లిపట్టులో పార్టీ జెండా ఎగురవేస్తున్న సీజే శ్రీనివాసన్, సెంథిల్‌కుమార్ తదితరులు - తిరుత్తణిలో పారిశుధ్య కార్మికులకు సహాయాలు అందజేస్తున్న మంత్రి నాజర్, ఎమ్మెల్యే చంద్రన్ తదితరులు

తిరుత్తణి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి 8వ జన్మదిన వేడుకలు తిరువళ్లూర్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పల్లిపట్టు డీఎంకే నార్త్ యూనియన్, పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు సెంథిల్ కుమార్ అధ్యక్షత వహించగా, నార్త్ యూనియన్ కార్యదర్శి, న్యాయవాది సీజే శ్రీనివాసన్ పార్టీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ యూనియన్ కార్యదర్శి పి.రవీంద్రనాథ్, యూనియన్ కౌన్సిల్ అధ్యక్షుడు తిరుమలై లోకనాథన్, పల్లిపట్టు పురపాలక సంఘ అధ్యక్షుడు ఎస్.మణిమేగళ, జిల్లా ప్రతినిధి టి.సెంగయ్య, కౌన్సిలర్లు డి.విజయాలు, ఎం.గుణశేఖర్, పి.చిరంజీవి, జగదీష్, ఆర్.మురళి, ఎస్కే రవి, జి.మనోహరన్, జె.సుభాన్, ఇ.ఎతిరాజ్, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుత్తణిలో...

తిరుత్తణి డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదిన వేడుకలు నిర్వహించారు. తిరువళ్లూర్ వెస్ట్ డీఎంకే యువజన విభాగం కన్వీనర్ కిరణ్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా మంత్రి నాజర్ పాల్గొని, చిరువ్యాపారులకు గొడుగులు, ఆటో కార్మికులకు యూనిఫాం, మహిళలకు చీరలు, పారిశుధ్య కార్మికులు సహా 500 మందికి వివిధ సహాయకాలు అందజేశారు. అనంతరం 500 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చంద్రన్, మాజీ జిల్లా కార్యదర్శి భూపతి, పట్టణ కార్యదర్శి వినోద్ కుమార్ సహా యువజన విభాగం కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా ఆర్‌ఏ పురం, ఆర్కే నగర్ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఆర్‌ఏ పురం: ఎమ్మార్సీ నగర్, పట్టిణంబాక్కం, ఫోర్‌షోర్ ఎస్టేట్ (కొంత భాగం), గాంధీ నగర్ (కొంత భాగం), పీఆర్వో క్వార్టర్స్, ఆర్కే మఠం, ఆర్కే నగర్, రాణి మెయ్యమ్మై గోపురం, సత్యదేవ్ అవెన్యూ, ట్రూవాల్యూ హోమ్స్, హెచ్‌టీ సర్వీస్, రాజా వీధి, రాబర్ట్‌సన్ లైన్, రాజా గ్రామణి గార్డెన్, కేవీపీ గార్డెన్, అప్పా గ్రామణి వీధి, వేలాయుధరాజా వీధి, టీపీ స్కీమ్ రోడ్డు, రాజా ముత్తయ్యాపురం

ఆర్కే నగర్: వీఓసీ నగర్, ఆర్కే నగర్, తిలగర్ నగర్, ఎల్లయ్య ముదలి వీధి, సేనియప్పన్ ఆలయ వీధి, టీహెచ్ రోడ్డు, టోల్‌గేట్, స్టాన్లీ, పాత వాషర్‌మెన్‌పేట, కన్నికోవిల్, కల్ మండపం ఏరియా, గుమ్మాలమ్మన్ ఆలయ వీధి, జీఏ రోడ్డు, తాండవల్లియ గ్రామం వీధి, శ్రీరంగమ్మాళ్ వీధి, సంజీవరాయన్ ఆలయ వీధి, కప్పల్‌బాలు వీధి, బాలు ముదలి వీధి, జేవీ ఆలయ వీధి, రామానుజఅప్పర్ వీధి, బాల అరుణాచల వీధి, లాయర్ చిన్నతంబి 1,2 వీధులు

పాల ఉత్పత్తిలో రాష్ట్రం సరికొత్త రికార్డు

● మంత్రి రాజకన్నప్పన్

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిలో రాష్ట్రం ఏడాదికి ఏడాది సరికొత్త రికార్డు సృష్టిస్తోందని పాడిపరిశ్రమల శాఖ మంత్రి రాజకన్నప్పన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... పాల ఉత్పత్తిదారులను ప్రభుత్వం ప్రోత్సహించడం వల్ల పాల ఉత్పత్తిలో తమిళనాడు ముందుకు దూసుకెళ్తోందని జాతీయ పాల అభివృద్ధి బోర్డు విడుదల చేసిన సర్వేలో వెల్లడైందని మంత్రి వివరించారు. ఆ సర్వే వివరాల మేరకు 2017 నుంచి 2020 వరకు 7.742, 8.362, 8.759 మిలియన్ లీటర్లున్న పాల ఉత్పత్తి 2021 నుంచి 2023 సంవత్సరాల్లో 9.790, 10.107, 10.317 మిలియన్ లీటర్లకు పెరిగిందని తెలిపారు. 2023-24 సంవత్సరంలో జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు రూ.25.85 లక్షలు ప్రోత్సాహకం ఇచ్చినట్లు తెలిపారు. పాడి పశువులను పోషిస్తున్న రైతుల సంక్షేమార్థం సుమారు 5 లక్షల పాడి పశువులకు 85 శాతం సబ్సిడీతో బీమా పథకం అమలు జరుగుతుందని, పాల ఉత్పత్తిదారులు జీవనశైలి మెరుగుపరిచేలా ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం కొత్త పథకాలు అమలుపరుస్తోందని మంత్రి తెలిపారు.

ఎత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మేక బలి

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేరాలు జరగకూడదని వేడుకుంటూ ఎత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మేకను బలి ఇచ్చి పూజలు చేసినట్టు తెలిసింది. సేలం జిల్లా ఎత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ కుమరన్, ఎస్ఐ, 28 మంది కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల సంఖ్య అధికమవుతోంది. దీంతో, నేరాలు జరుగకుండా ఉండాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో మేకను బలిచ్చి, దాని రక్తాన్ని పోలీస్‌స్టేషన్ ప్రవేశద్వారం ఉంచి పూజలు చేశారు. అలాగే, నిమ్మకాయలు, గుమ్మడికాయలు పగులగొట్టి నాలుగు మూలల చల్లి, పసుపు, కుంకుమ పూసి పూజలు చేశారు. నేరాలు తగ్గాలని పోలీస్‌స్టేషన్‌లో చేపట్టిన పూజలపై ఆ ప్రాంత ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

గ్రీవెన్స్‌లో 25 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

వేళచ్చేరి, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): స్థానిక వెప్పేరి లోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి 25 వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమస్యలను విచారించి సత్వరం చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎ.కయల్‌విళి, డిప్యూటీ కమిషనర్ (ప్రధాన కార్యాలయం) ఎస్.మెకిలినా తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు పడితే చదురగిరికి అనుమతి లేదు

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిస్తే చదురగిరికి భక్తులను అనుమతించమని అటవీ శాఖ తెలిపింది. శ్రీవిల్లిపుత్తూర్-మేఘమలై పులుల శరణాలయం పరిధిలోని పశ్చిమ కనుమల్లో ప్రసిద్ధిచెందిన చదురగిరి సుందర మహాలింగం స్వామివారి ఆలయం ఉంది. ఈ ఆలయానికి అమావాస్య, పౌర్ణమి, ప్రదోషం ఇలా 8 రోజులు మాత్రమే భక్తులను అనుమతిస్తుంటారు. ఆ ప్రకారం, ఈ నెల అమావాస్య సందర్భంగా గురువారం నుంచి డిసెంబరు 1వ తేది వరకు నాలుగు రోజులు భక్తులను అనుమతించనున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. కాగా, ప్రస్తుతం ఫెంగల్ తుఫాను కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. ఈ రోజుల్లో పశ్చిమ కనుమల్లో వర్షాలు కురిస్తే చదురగిరి ఆలయానికి భక్తులను అనుమతించమని అటవీ శాఖ ప్రకటన విడుదల చేసింది.

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

సేలం జిల్లా మేట్టూరు జలాశయానికి నీటి రాక స్వల్పంగా తగ్గింది. మంగళవారం సాయంత్రం జలాశయంలోకి 4,936 ఘనపుటడుగులుగా వస్తున్న నీరు బుధవారం ఉదయం 4,427 ఘనపుటడుగులకు తగ్గింది. ప్రస్తుతం జలాశయంలో 109.71 అడుగులు (78.22 టీఎంసీలు) నీటినిల్వలుండగా, డెల్టా సాగు కోసం 1,600 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రెండు వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు టెండర్లు

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేసవి సీజన్‌లో విద్యుత్ కొరత అధికమించేలా 2,000 మెగావాట్ల కొనుగోలుకు విద్యుత్ బోర్డు టెండర్లు విడుదల చేసింది. రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ వినియోగం 15,000 మెగావాట్లుండగా, వేసవిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుంది. ఆ ప్రకారం, గత ఏడాది మే 2వ తేది అత్యధికంగా విద్యుత్ వినియోగం 20,830 మెగావాట్లకు చేరింది. వచ్చే ఏడాది వేసవిలో విద్యుత్ వినియోగం 5 నుంచి 7 శాతం వరకు పెరిగే అవకాశముంటుందని భావిస్తున్న విద్యుత్ బోర్డు, విద్యుత్ కొరత అధికమించేలా మార్చి 1 నుంచి మే 10వ తేది వరకు కేంద ప్రభుత్వం, ప్రైవేటు సంస్థల నుంచి 850 నుంచి 2,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేసేందుకు టెండర్లు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు.

శివకాశిలో ముమ్మరంగా

క్యాలెండర్ల తయారీ



పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాణసంచా, అగ్గిపెట్టెల తయారీలో పేరుగాంచిన విరుదునగర్ జిల్లా శివకాశి, క్యాలెండర్ల పరిశ్రమకు కూడా ప్రసిద్ధిచెందింది. ఈ ప్రాంతంలో సుమారు 300కు పైగా సంస్థలు క్యాలెండర్లు తయారు చేస్తున్నాయి. ప్రతి ఏడాది ఆడి మాసం 18వ రోజు నుంచి ప్రారంభమవుతుంటాయి. ప్రస్తుతం 2025 డైరీలు, నెలవారీ క్యాలెండర్ల తయారీ ముమ్మరంగా సాగుతోంది. పలు పార్టీలు, కార్మిక సంఘాలు, వాణిజ్య సంస్థలు, వ్యక్తులు తమ తమ పేర్లతో క్యాలెండర్లకు ఆర్డర్లు ఇచ్చారు. అలాగే, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ఆర్డర్లు అందాయి. సుమారు 80 శాతం ఆర్డర్లు రాగా 60 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం విద్యుత్ ఛార్జీలు, కాగితం, ఇతర ముడిపదార్థాల ధరలు పెరగడంతో 10 శాతం మేర క్యాలెండర్ ధరలు పెంచినట్టు తమిళనాడు క్యాలెండర్ తయారీదారుల సంఘం కార్యదర్శి జయశంకర్ తెలిపారు.

రివ్యూలపై సముచిత నిర్ణయం తీసుకోవాలి

నిర్మాత సురేష్ కామాక్షి

చిత్రపరిశ్రమలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా పలువురు దర్శక నిర్మాతలు సినిమా రివ్యూలను వ్యతిరేకిస్తున్నారనీ, తన విషయానికి వస్తే ఒక సినిమాకు రివ్యూ ఎంతో ముఖ్యమని ప్రముఖ నిర్మాత, వి హౌస్ నిర్మాణ సంస్థ అధినేత సురేష్ కామాక్షి అభిప్రాయపడ్డారు. గణేశ పాండి దర్శకత్వంలో ఎస్సీ రాజాసేతుపతి సమర్పణలో ఎస్.రాంప్రకాష్ ఎస్‌పీఆర్ ఫిలిమ్స్ బ్యానరుపై నిర్మించిన చిత్రం సైలెంట్. హీరోయిన్‌గా ఆరాధ్య, మురళి రాధాకృష్ణన్, సమయమురళి, ఆరం రామ్స్, బిగ్‌బాస్ నమీత, మారిముత్తు తదితరులు నటించారు. చెన్నై దక్షిణ ఐఆర్ఎస్, జీఎస్టీ అదనపు కమిషనరు టి.సమయమురళి ఈ చిత్రానికి సంగీతం సమకూర్చడం విశేషం. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ తాజాగా నగరంలో జరిగింది. ఇందులో ముఖ్య అతిథులుగా దర్శకుడు శీను రామస్వామి, నిర్మాత సురేష్ కామాక్షి ఆడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సురేష్ కామాక్షి మాట్లాడుతూ, 'సినిమా రివ్యూలపై భిన్నాభిప్రాయాలున్నాయి. ఒక సినిమాకు రివ్యూ తప్పనిసరి. తొలి షోకు ప్రేక్షకులు లేకుంటే రెండో ఆట ప్రదర్శనకు అవకాశమే లేదు. అందువల్ల రివ్యూల విషయంలో చిత్రపరిశ్రమ సముచితంగా చర్చించి ఒక మంచి నిర్ణయం తీసుకోవాలి' అని కోరారు. దర్శకుడు శీను రామస్వామి మాట్లాడుతూ, 'నాటి నుంచి నేటి వరకు చిన్నబడ్జెట్ చిత్రాలకు మీడియా మద్దతు తెలుపుతుంది. రివ్యూ లేకుంటే చిన్న సినిమాలు వచ్చేది, పోయేది తెలియదు. ప్రేక్షకుల అభిప్రాయాలను తెలుసుకుని ప్రసారం చేసేందుకు అనుమతించాలని ఆయన కోరారు. చిత్ర దర్శకుడు గణేషా పాండి మాట్లాడుతూ, 'ఈ సినిమా నా మొదటి బిడ్డ. ఈ టైటిల్ నాకు ఎంతో అవినాభావ సంబంధం ఉంది. చిన్నపుడు నోరు తెరిచేవాడిని కాదు. ఆ తర్వాత పేదరికం, జీవన పోరాటం ఇలా అనేక విషయాలకు సమాధానమే ఈ సినిమా. మీడియా ప్రతినిధులు ఆదరాభిమానాలను కోరుతున్నాను' అని తెలిపారు.



సైలెంట్ ఆడియో రిలీజ్

చిత్రజ్యోతి


'సూదు కవ్వుం-2' మూవీ యూనిట్ సభ్యులు

13న మిర్చి శివ
'సూదు కవ్వుం-2' రిలీజ్

నిర్మాత సీవీ కుమార్, ఎస్.తంగరాజ్ సంయుక్తంగా ఎస్‌జే అర్జున్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సూదు కవ్వుం-2'. మిర్చి శివ హీరో. వచ్చే నెల 13వ తేదీన విడుదల. ఇతర పాత్రల్లో కరుణాకరన్, వాగై చంద్రశేఖర్, రాధా రవి, ఎంఎస్ భాస్కర్, అరుళ్‌దాస్, రమేష్ తిలక్, యోక్ జేపీ, హరీషా జస్టిన్, కరాటే గాంధీ, కల్కి తదితరులు నటించారు. విడుదలను పురస్కరించుకుని చిత్ర బృందం నగరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఇందులో నిర్మాత సీవీ కుమార్ మాట్లాడుతూ, 'ఈ సినిమా తొలి భాగాన్ని తెరకెక్కించే సమయంలోనే రెండో భాగం నిర్మించాలని భావించాం. అది కార్యరూపం దాల్చింది. ఈ సినిమాను వచ్చే నెల 13వ తేదీ విడుదల చేస్తున్నాం. మీడియాతో పాటు ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు అర్జున్ మాట్లాడుతూ, 'ముండాసుపట్టి సినిమాకు అసిస్టెంట్‌గా పనిచేశాను. 13 యేళ్ళు పూర్తయ్యాయి. నిర్మాత కుమార్ పిలుపు మేరకు ఇపుడు ఈ సినిమా తెరకెక్కించాం. ఎంతో సంతోషంగా ఉంది. ఈ సినిమాలో 'వచ్చే అవకాశంలో ఉండే సమస్యను చూడొద్దు... ఆ సమస్యలో ఉన్న అవకాశాన్ని చూడు' అనే డైలాగ్ ఉంది. దానిని మనసులో పెట్టుకుని స్క్రిప్టు సిద్ధం చేశాం. కథ సిద్ధం చేసిన హీరో ఎవర్నదానిపై చర్చ జరిగింది. చివరకు మిర్చి శివను ఎంపిక చేశాం. ఆ తర్వాత అనేక మంది నటీనటులను ప్రాజెక్టులోకి వచ్చారు. విజయవంతంగా పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం' అన్నారు. హీరో మిర్చి శివ మాట్లాడుతూ, 'నిర్మాత సీవీ కుమార్ అనేక చిత్రాలను నిర్మించారు. అనేక మంది కొత్తవారిని పరిచయం చేశారు. అలాంటి వారిలో పా.రంజిత్, కార్తీక్ సుబ్బరాజ్, నలన్ కుమారస్వామి వంటివారు ఉన్నారు. సినిమాపై ఆయనకు అమితమైన ప్రేమ ఉంది. అందుకే నటించేందుకు అంగీకరించాను. మనం 'ఎంటర్ ది డ్రాగన్' సినిమా చూశాం. కానీ సీవీ కుమార్ ఈ సినిమాతో 'రిటర్న్ ది డ్రాగన్'గా మళ్ళీ మనముందుకు వస్తున్నారన్నారు. ఇతర నటీనటులు కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

త్రిష మాటల్లో
మర్మమేంటి?



హీరోయిన్ త్రిష తాజాగా చేసిన వ్యాఖ్యలపై ఇపుడు కోలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఎవరిని ఉద్దేశించి అలా వ్యాఖ్యానించారు? ఆమె మాటల్లో మర్మమేంటి? అనే సందేహాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. తమిళంలో 'థగ్‌లైఫ్', 'విడాముయర్చి', 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాలతో పాటు తెలుగు, మలయాళ భాషా చిత్రాల్లో నటిస్తూ ఎంతో బిజీగా ఉంది. ఈ నేపథ్యంలో ఆమె తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ చేశారు. 'మన మనసులను గాయపరిచిన వ్యక్తులకు సన్నిహితంగా మెలిగే వ్యక్తులతో కూడా మనం దూరంగా ఉండాలి' అని కోరారు. ఇది చూసిన సినీ ప్రముఖులు.. ఎవరిని ఉద్దేశించి త్రిష ఈ తరహా వ్యాఖ్యలు చేసివుంటారని ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు.

అర్థ శతాబ్దంగా ఆయనొక్కరే కథానాయకుడు

హీరో సూరి

అర శతాబ్దం కాలంగా ప్రతి ఒక్క వేడుకల్లోనూ కథానాయకుడిగా ఇసైజ్ఞాని ఇళయరాజా ఉంటున్నారని హీరో సూరి ప్రశంసించారు. ప్రేమ, పెళ్ళి ఇలా ఏ వేడుక జరిగినా ఆయన పాటలే వినిపిస్తాయని, అందుకే గత 49 యేళ్ళుగా ఆయన హీరోగా కొనసాగుతున్నారన్నారు. వెట్రిమారన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, సూరి, మంజు వారియర్, భవానీ శ్రీ, గౌతం వాసుదేవ్ మేనన్, రాజీవ్ మేనన్, బోస్ వెంకట్, బాలాజీ శక్తివేల్‌లు ప్రధాన పాత్రలు పోషించిన 'విడుదలై-2' చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుక మంగళవారం రాత్రి నగరంలో జరిగింది. ఇందులో హీరో సూరి మాట్లాడుతూ, 'ఈ ఒక్క వేడుకలోనే కాదు 49 యేళ్ళుగా అన్ని వేడుకల్లో ఇళయరాజా హీరోగా ఉన్నారు. నేను చిత్రపరిశ్రమలోకి వచ్చిన కొత్తలో వెళ్ళని చోటు లేదు. ఆయన పాటలు ఒక తల్లిలా లాలిస్తాయి. ప్రతి కాలానికి ఒక ఆప్షన్ ఉంటుంది. కానీ, ఎలాంటి ఆప్షన్ లేని ఒకే ఆప్షన్ ఇళయరాజా మాత్రమే. ఆయనకు ప్రత్యామ్నాయం అనేది లేదు. ఆయన జీవితంలో జరిగిన అనేక సంఘటనలు నాకు చెప్పారు. అవి జీవితకాలం గుర్తుండిపోతాయన్నారు. హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ, 'వెట్రిమారన్ ఒక అద్భుతమైన చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా తొలి భాగంలోనే ఇది నిరూపణ అయింది. ఇపుడు రెండో భాగం మరింత అద్భుతంగా ఉంటుందన్నారు. దర్శకుడు వెట్రిమాన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాకు స్టోరీ కంటే ఇళయరాజా సంగీతం మరింత బలాన్ని చేకూర్చింది. ఆయనతో కలిసి చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. విజయ్ సేతుపతి దగ్గర 8రోజుల క్యాల్షీట్ అడిగి దాదాపు వంద రోజులకుపైగా వాడుకున్నాను. ఆయనకు ఈ సినిమాపై ఉన్న ప్రేమ అలా నడిపించింది' అని పేర్కొన్నారు. ఇళయరాజా మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో నటించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. తొలి భాగంలాగే, రెండో భాగం కూడా ఘన విజయం సాధిస్తుందన్నారు. నిర్మాత ఎల్‌రెడ్ కుమార్, భవానీ శ్రీ, రాజీవ్ మేనన్ తదితరులు ప్రసంగించారు.


ట్రైలర్ రిలీజ్‌లో
విజయ్ సేతుపతి, ఇళయరాజా, వెట్రిమారన్, సూరి



ప్రదర్శన ప్రారంభిస్తున్న విమల్ ఆనంద్

2 ట్రిలియన్ డాలర్ల ఎగుమతులకు రోడ్‌మ్యాప్

● కేంద్ర పరిశ్రమల శాఖ సంయుక్త కార్యదర్శి

చెన్నై, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది తమ శాఖ ఆవిష్కరించిన కొత్త విదేశీ వాణిజ్య విధానంలో 2 ట్రిలియన్ డాలర్లకు భారతీయ ఎగుమతులను తీసుకెళ్లేందుకు రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని కేంద్ర పరిశ్రమలశాఖ సంయుక్త కార్యదర్శి విమల్ ఆనంద్ పేర్కొన్నారు. నందంబాక్కంలోని చెన్నై ట్రేడ్‌సెంటర్‌లో బుధవారం 'ఇంటర్నేషనల్ ఇంజనీరింగ్ సోర్సింగ్ షో' (ఐఈఎస్ఎస్) ప్రదర్శన ఏర్పాటైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శన లాంఛనంగా ప్రారంభించిన విమల్ ఆనంద్ మాట్లాడుతూ.. భారతీయ ఇంజనీరింగ్ ప్రపంచంలోని ప్రతి మూలకు తీసుకెళ్లడంలో ఈఈపీసీ కీలకపాత్ర పోషిస్తోందని అభినందించారు. దేశం మొత్తం మీద ఇది ఐఈఎస్ఎస్ 12వ ప్రదర్శన కాగా, తమిళనాట ఏడవది. 300 మంది ప్రతినిధులు, 2వేల మందికి పైగా ముఖాముఖి, 30మంది వక్తలు ఉపన్యసించనున్నారు. ఈప్రదర్శనను 10వేలమందికిపైగా సందర్శిస్తారని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఈఈపీసీ ఛైర్మన్ పంకజ్ చద్దా, ఈఈపీసీ వైస్ ఛైర్మన్ ఆకాష్ షా తదితరులు పాల్గొన్నారు.

పళని ఆలయంలో రష్యా భక్తుల పూజలు


మురుగన్‌కు ఆరడుగుల వేలాయుధాన్ని కానుకగా అందిస్తున్న భక్తులు

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిచెందిన పళని మురుగన్ ఆలయానికి దక్షిణాది రాష్ట్రాలతో పాటు, మలేసియా, సింగపూర్, ఇటలీ, రష్యా సహా పలు దేశాలకు చెందిన భక్తులు కూడా వచ్చి పూజలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, రష్యాకు చెందిన ఐదుగురు భక్తులు పది రోజుల క్రితం రాష్ట్రానికి చేరుకొని, పలు ఆలయాలను సందర్శిస్తున్నారు. మంగళవారం పళని మురుగన్ ఆలయాన్ని సందర్శించిన రష్యా భక్తులు, స్వామివారికి 6 అడుగుల పొడవు, 12 కిలోల బరువైన ఇత్తడి వేలాయుధాన్ని కానుకగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

తిరుచెందూర్‌లో వెనక్కివెళ్లిన సముద్రం


తీరంలో బయల్పడిన పాచిపట్టిన రాళ్లు

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సునామీ అనంతరం పలు ప్రాంతాల్లో పౌర్ణమి, అమావాస్య రోజుల్లో సముద్రం వెనక్కి వెళ్లడం జరుగుతోంది. ప్రస్తుతం 'ఫెంగల్' తుపాను కారణంగా సముద్రపు అలలు సాధారణ స్థాయి కంటే 9 నుంచి 12 అడుగుల ఎత్తున ఎగసిపడతాయని, జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో, మంగళవారం ఉదయం తిరుచెందూర్‌లో సముద్రం అల్లకల్లోలంగా కనిపించింది. సాయంత్రం ఒక్కసారిగా సముద్రం 80 అడుగుల వెనక్కి వెళ్లింది. దీంతో, నాలికినరు నుంచి అయ్యా ఆలయం వరకు సుమారు 500 మీటర్ల మేర నాచుతో కూడిన బండరాళ్లు బయటపడ్డాయి. ఆ ప్రాంతంలో సుబ్రమణ్యస్వామి ఆలయానికి వచ్చిన భక్తులు పాచిపట్టిన రాళ్లపై సెల్ఫీలు తీసుకుంటూ బండల మధ్య చేపలు పట్టారు. ఆలయ నిర్వాహకులు, పోలీసులు వారిని హెచ్చరించి అక్కడి నుంచి పంపించివేశారు. కాగా, ఈ నెల 30న అమావాస్య కాగా, మూడు రోజుల ముందుగానే సముద్రం వెనక్కి వెళ్లిందని స్థానికులు పేర్కొంటున్నారు.

మేడవాక్కంలో రూ.1.22 కోట్లతో పాఠశాల భవనం

● ప్రారంభించిన మంత్రులు


పాఠశాల భవనాలు ప్రారంభిస్తున్న మంత్రులు సుబ్రమణ్యం, అన్బిల్ మహేష్ తదితరులు

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ చెన్నై శివారులోని మేడవాక్కంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 'నమక్కు నామే' పథకం కింద రూ.1.21 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని బుధవారం మంత్రులు ఎం.సుబ్రమణ్యం, అన్బిల్ మహేష్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం మాట్లాడుతూ.. సీఎం స్టాలిన్ ఆదేశాలమేరకు తమిళ్ పుగల్వన్, పుదుమై పెన్, పేరాసియర్ పాఠశాల విద్య అభివృద్ధి పథకాలను రాష్ట్రవ్యాప్తంగా అమలుపరుస్తున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యాశాఖలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో విద్యార్థులకు మరిన్ని సదుపాయాలను సమకూర్చుతున్నట్లుతెలిపారు. ఆరీతిలో మేడవాక్కం ప్రభుత్వపాఠశాలలో 8తరగతి గదులు, ఒక లైబ్రరీ నిర్మాణానికి మద్రాసు రౌండ్ టేబుల్ సంస్థ రూ.80 లక్షలు అందజేసిందని మంత్రి తెలిపారు.


అవార్డు అందుకుంటున్న శివకుమారి

శివకుమారికి ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ అవార్డు

చెన్నై, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రముఖురాలు, విద్యావేత్త డాక్టర్ శివకుమారిని ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ అవార్డు వరించింది. ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ 324 ఎం డిస్ట్రిక్ తొలి అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం రాత్రి నగరంలో జరిగింది. జిల్లా డిస్ట్రిక్ ఛైర్‌పర్సన్ ఎస్.మోహన్‌రాజ్, పి.శ్యామ్‌సుందరం నేతృత్వంలో జరిగిన ఈ ఉత్సవానికి గవర్నర్ లయన్ ఎన్.వరదరాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లయన్ ఎస్.బోస్, ఎం.జోషి, కె.చంద్రశేఖర్, సి.మీనాక్షి సుందరం, ఎస్.శేఖర్, జె.సురేష్, ఎస్.విఘ్నేశ్వరం తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, సమాజ సేవ తదితర అంశాల్లో కృషి చేసిన శివకుమారికి ఈ సందర్భంగా ఆరు అవార్డులు ప్రదానం చేసి, అభినందించారు. లయన్స్ గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు స్వీకరించడం సంతోషంగా వుందని శివకుమారి హర్షం వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడికి చెన్నైలో కీలు మార్పిడి చికిత్స



రిచర్డ్ టొవాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ నందకుమార్ సుందరం, హాస్పిటల్ సీఓఓ వేణుగోపాల్ భట్

చెన్నై, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడికి మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్స ఎంజీఎంలో విజయవంతంగా నిర్వహించారు. నగరంలోని అడయార్ ఎంజీఎం మలర్ ఆస్పత్రిలో కెమరూన్‌కు చెందిన రిచార్డ్ టొవా (54)కు విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ నందకుమార్ సుందరం తెలిపారు. గత ఆరునెలలుగా తీవ్రమైన మోకాలి నొప్పితో బాధపడిన రిచార్డ్ చికిత్సకోసం తమ ఆస్పత్రిలో చేరాడని, వైద్యులు పరీక్షించి అతడి కుడివైపు మోకాలి కీలు బాగా దెబ్బతిన్నట్లు గుర్తించారని తెలిపారు. ఆ తర్వాత ప్రత్యేక వైద్య బృందం ఆయనకు పూర్తిస్థాయిలో మోకాలి కీలు మార్పిడి శస్త్రచికిత్స చేసినట్టు తెలిపారు. చికిత్స జరిగిన రెండు వారాల తర్వాత రిచార్డ్ పూర్తిగా కోలుకున్నారని తెలిపారు.

క్షేత్ర సమీక్ష పేరుతో అలజడులకు కుట్ర

● అన్నాడీఎంకేపై డిప్యూటీ సీఎం ఉదయనిధి ధ్వజం



కలైంజర్ స్మారక మందిరంలో సెక్యూరిటీ సిబ్బందికి సహాయాలు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి - కరుణ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఉదయనిధి

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నాయకులు క్షేత్ర సమీక్ష పేరుతో అలజడులకు కుట్ర పన్నుతున్నారని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ధ్వజమెత్తారు. బుధవారం 48వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా మెరీనా బీచ్‌లోని దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి స్మారక మందిరంలో ఉన్న కలైంజర్ సమాధిపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు కిరాణా సరుకులతో కూడిన సంక్షేమ సహాయాలను ఉదయనిధి అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..గత పార్లమెంటుఎన్నికల్లో ఊహించని రీతిలో భారీవిజయాన్ని చూశామని, అలాంటి విజయం మళ్లీ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా సాధించేలా డీఎంకే శ్రేణులు కష్టపడి పనిచేయాలన్నారు. 234 నియోజకవర్గాల్లో 200 స్థానాల్లో విజయమే లక్ష్యంగా ఏడోసారి కూడా డీంఎకేను అధికారంలో కూర్చోబెట్టాలని పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరు ద్రావిడ మోడల్ అంటే ఏమిటని అడుగుతున్నారని, అందరికి సమానంగా ప్రభుత్వ పథకాలు అందజేయడమే లక్ష్యమన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా కలైంజర్ స్మారక మందిరంలో విధుల్లో పాల్గొంటున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది, ఎలక్ట్రీషియన్లు మొత్తం 1,335 మందికి సంక్షేమ సహాయాలు అందజేసినట్లు తెలిపారు. కూటమిలో చేరుతున్నవారు రూ.100 కోట్లు డిమాండ్ చేస్తున్నారని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి దిండుగల్ శ్రీనివాసన్ ఆ పార్టీ క్షేత్రస్థాయి సమావేశంలో బహిరంగంగా ఆరోపించారని, రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధపడేలా అన్నాడీఎంకే తరపున అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి సమావేశాలు అలజడులకు దారితీసేలా ఉన్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ సూచనల మేరకు డీఎంకే ఇప్పటికే ఎన్నికల పనులు ప్రారంభించిందన్నారు.

వర్గీస్ కురియన్‌కు 'భారత రత్న'

పాల ఉత్పత్తిదారుల సంఘం డిమాండ్

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిలో విప్లవం తీసుకొచ్చిన డా.వర్గీస్ కురియన్‌కు భారత రత్న ప్రకటించాలని తమిళనాడు పాల ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. వ్యాసర్పాడి భక్తవత్సలం కాలనీలో సుబ్రమణ్యస్వామి ఆధ్యాత్మిక ట్రస్ట్ కల్యాణ మండపంలో జాతీయ పాల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు ఎస్ఎ పొన్నుస్వామి నేతృత్వం వహించగా, ప్రధాన కార్యదర్శి ఎస్.పొన్‌మారియప్పన్, కోశాధికారి ఎస్.మురుగన్ ఆహ్వానించారు. కార్యక్రమంలో భాగంగా పాల ఉత్పత్తిదారుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు.


పాల ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం వేడుకల్లో నిర్వాహకులు

కోయంబేడు ఫ్లై ఓవర్ సమీపంలో రూ.8.63 కోట్లతో గ్రీన్ పార్క్


పార్క్ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు ఫ్లై ఓవర్ రౌండ్ టానా కింద 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.8.63 కోట్లతో గ్రీన్ పార్క్ నిర్మాణపనులను సీఎండీఏ చేపట్టింది. ఈ రౌండ్ టానా కింద భవన నిర్మాణ వ్యర్థాలు, పాత టైర్లు, చెత్త వేస్తున్నారు. ఈ విషయమై స్థానికులు చేసిన ఫిర్యాదులపై స్పందించిన సీఎండీఏ రూ.50 లక్షలతో ఫౌంటైన్‌తో కూడినా పార్క్ ఏర్పాటుచేసింది. గత ఏడాది మెట్రోవాటర్ బోర్డు పనుల కారణంగా ఈ పార్క్ పాడైయింది. ప్రస్తుతం కోయంబేడు ఇన్నర్ రింగ్ రోడ్డు, చెన్నై-పూందమల్లి జంక్షన్ వద్ద 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.8.63 కోట్లతో గ్రీన్ పార్క్ నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ ఉద్యానవనంలో చెట్లు, మొక్కలు, పేవ్‌మెంట్, సీటింగ్, 50 మంది కూర్చొనేలా ఆడిటోరియం, పిల్లల ఆట స్థలం, యోగా, ధ్యాన మందిరం, వ్యాయామ శాల, బైక్, కార్ పార్కింగ్, వాటర్ ఫౌంటైన్ తదితరాలు ఏర్పాటుకానున్నాయి. ఈ పనులు ఆరు నెలల్లో పూర్తిచేసి ప్రజల వినియోగంలోకి తీసుకొస్తామని అధికారులు తెలిపారు.

సమాజహిత పరిశోధనలు రావాలి

● డీఎస్పీ జాన్ ఎస్.కెనడి

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేరాలను సంపూర్ణంగా అదుపుచేసేందుకు సమాజానికి మేలు చేసే పరిశోధనలు రావాల్సిన అవసరం ఉందని డీఎస్పీ జాన్ ఎస్.కెనడి పిలుపునిచ్చారు. నగరంలోని సెయింట్ జోసఫ్ టెక్నాలజీ కళాశాల, సుప్రజ టెక్నాలజీస్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన సెక్యూరిటీ సెంటర్ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్ ఇఖాజగన్, డీన్ డా.ఎన్.అరుణ్‌కుమార్, డా.జె.డాఫ్నేరోజ్, సుప్రజ టెక్నాలజీస్ వ్యవస్థాపకులు, సీఈఓ సంతోష్ సాల్వాడిలు సైబర్ సెక్యూరిటీ సెంటర్ కోసం అధునాతన ల్యాబ్ ప్రారంభించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ ఇఖాజగన్ తెలిపారు. డీఎస్పీ జాన్ కెనడి దేశంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు. నిజాయితీగా హ్యాకింగ్, డేటా భద్రతలో అత్యాధునిక శిక్షణ అందించే లక్ష్యంతో సెయింట్ జోసఫ్ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు.

సెయింట్ జోసఫ్ టెక్నాలజీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ సెంటర్ ప్రారంభోత్సవంలో జాన్ ఎస్.కెనడి, ప్రిన్సిపాల్ ఇఖాజగన్ తదితరులు









చిత్తమెరిగిన చిత్తానూరమ్మ

నేటినుంచి తిరుచానూరు బ్రహ్మోత్సవాలు

హరి అంతరంగ అలమేలుమంగ పద్మావతి అమ్మవారికి ప్రీతిపాత్రమైనవి కార్తీక బ్రహ్మోత్సవాలు. తిరుమల శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల తర్వాత అంత వైభవంగా జరుగుతాయి తిరుచానూరు బ్రహ్మోత్సవాలు. ఏటికేడాది ఈ వేడుకలను టీటీడీ మరింత ఘనంగా నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే దీపకాంతులతో తిరుచానూరు వెలిగిపోతోంది. తిరుపతి నుంచి గరుడవారధి పైనా, కిందా ఏర్పాటు చేసిన దీపతోరణాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. నిజానికి అలిమేలు మంగమ్మకు, తిరుమల శ్రీనివాసుడికి వలే ఏడాది పొడవునా అనేక ఉత్సవాలు జరుగుతుంటాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

పద్మావతిదేవి ఆలయాన్ని తిరుచానూరులో 1820-50 సంవత్సరాల్లో హథీరాంజీ మఠాధిపతులు జీర్ణోద్ధరణ చేసినట్లు చరిత్ర చెబుతోంది. అప్పటినుంచి అమ్మవారి ఆలయంలో నిత్య, వార, పక్ష, మాస, సంవత్సరాది ఉత్సవాలను ఆలయ వేద పండితులు పాంచరాత్ర ఆగమం ప్రకారం నిర్వహిస్తున్నారు.

నిత్యోత్సవాలు

ప్రతిరోజూ అలిమేలు మంగతాయారుకు సుప్రభాతం, సహస్రనామార్చన, నిత్యార్చనతోపాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఏకాంతసేవ, కుంకుమార్చన, వేద ఆశీర్వచన సేవలు జరుగుతాయి.

వారోత్సవాలు

సోమవారం అష్టదళ పాదపద్మారాధన, గురువారం తిరుప్పావడ సేవ, శుక్రవారం మూలవర్లకు అభిషేకం, వస్త్రాలంకరణ సేవ, లక్ష్మీపూజ, ఉద్యానవనంలో ఉత్సవర్లకు అభిషేకం, సహస్ర దీపాలంకరణ సేవ, శనివారం సామవేద పుష్పాంజలి చేపడతారు.

పక్షోత్సవాలు

ప్రతి ఏకాదశి రోజున ద్వార పాలకులకు కర్పూర్ధబింబిమాస, స్నపన విశేషాలు నిర్వహిస్తారు.

మన చిత్తానూరు

శుక మహర్షిచే పాంచరాత్ర ఆగమం ప్రకారం అమ్మవారు పూజలందుకున్న తిరుశుకనూరు కాలక్రమంలో తిరుచానూరుగా నామరూపాంతరం చెందింది అంటారు. అలర్మేల్‌మంగై క్షేత్రంగా తిరుచానూరుకు అలిమేలు మంగాపురం అనే మరో పేరుకూడా ఉంది. నేటికీ తిరుచానూరును అలిమేలు మంగాపురంగానే పిలుస్తుంటారు. అలర్ అంటే అలలు, మేల్ అంటే పైన మంగై అంటే అమ్మవారు. పద్మావతి అమ్మవారు పద్మసరోవరంలో అలలపై నుంచి బంగారు కమలంలో ఆవిర్భవించారని పండితులు అర్థం చెబుతారు. తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల వారు మాత్రం తరాలుగా చిత్తానూరు అనే అంటూ ఉంటారు.

వార్షికోత్సవాలు

కార్తీక మాసపు బ్రహ్మోత్సవాల్లో లక్ష కుంకుమార్చన, పుష్పయాగం నిర్వహిస్తారు. మార్గశిర మాసంలో ధనుర్మాస పూజలు, మాఘమాసంలో త్రైమాసం, శరడులు (తిరుమాంగల్యం), ఫాల్గుణమాసంలో ఫాల్గుణి ఉత్తర ఉత్సవం, చైత్రమాసంలో ఉగాది ఆస్థానం, వసంతోత్సవాలు, జేష్టమాసంలో పద్మసరోవరంలో తెప్పోత్సవాలు, శ్రావణమాసంలో కృష్ణాష్టమి వేడుకలు, వరలక్ష్మీ వ్రతం, భాద్రపదంలో పవిత్రోత్సవాలు, ఆశ్వయుజంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు.

మాస ఉత్సవాలు

ప్రతినెలా మొదటి బుధవారం అష్టోత్తర శతకలశాభిషేకం, పద్మావతి అమ్మవారి జన్మ నక్షత్రం ఉత్తరాషాడం పురస్కరించుకుని గజవాహనసేవ, రోహిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామికి అభిషేకం, వీథోత్సవం, అష్టమి తిథిన అమ్మవారి మూలవర్లకు అభిషేకం, ఉత్తరాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి, సమేత సుందరరాజ స్వామివారికి అభిషేకం, ఊంజల్ సేవ, తిరుచ్చి ఉత్సవం, ఆస్థానం జరుగుతాయి.

యాత్రికులలో కళకళ

ఒకనాటి చిత్తనూరు అలమేలుమంగ ఆలయానికి రెండువేల మంది భక్తులు మాత్రమే వచ్చేవారు. ప్రస్తుతం నిత్యం 30వేల మంది భక్తులు అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో పంచమీతీర్థం రోజు సుమారు లక్ష మందికి పైగా పద్మసరోవరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

అందరికీ అమ్మవారి దర్శనం

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి ● టీటీడీ ఈవో శ్యామలరావు



అన్నప్రసాదాన్ని పరిశీలిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, అధికారులు

తిరుచానూరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులందరికీ దర్శనం కల్పిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. వాహన సేవలు, ఇతర కార్యక్రమాలను భక్తులు వీక్షించేందుకు వీలుగా తిరుచానూరు పరిసర ప్రాంతాలతోపాటూ పద్మపుష్కరిణికి నాలుగు వైపులా ఈసారి మొత్తం 20 ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. గురువారం నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. భక్తులకు సైన్ బోర్డులు, రేడియో అండ్ బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామన్నారు. పంచమీతీర్థం సందర్భంగా డిసెంబరు 5వ తేదీ సాయంత్రం నుంచి భక్తులు వేచి ఉండేందుకు తిరుచానూరు పరిసర ప్రాంతాలైన జడ్పీ హైస్కూల్, పూడి రోడ్డు, నవజీవన్, తిరుచానూరు గేటు వద్ద 4 హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 120 కౌంటర్ల ద్వారా 50 వేలకుపైగా భక్తులకు తాగునీరు, బాదంపాలు, బిస్మిల్లాబాత్, పెరుగుఅన్నం, విజిటబుల్ ఉప్మాతోపాటూ ఈసారి అదనంగా చక్కెర పొంగలి అందిస్తామన్నారు. అన్నం, పప్పు, సాంబారు, రసం, స్వీట్‌తోపాటూ ఈసారి అదనంగా కర్రీని కూడా అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. అమ్మవారి వాహన సేవలను ఎస్వీబీసీలో హెచ్‌డీ క్వాలిటీతో ప్రత్యక్ష ప్రసారాలతో పాటూ, ఎస్వీబీసీ ఆన్‌లైన్ రేడియో, యూట్యూబ్ ద్వారా కూడా ప్రసారాలు అందిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో టీటీడీ భద్రతా సిబ్బంది, పోలీసులతో కలిపి 460 మంది, పంచమీతీర్థం రోజున 1500 మంది పోలీసులు, 600 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. డిసెంబరు 6న మధ్యాహ్నం 12.15 గంటల మధ్య పద్మ పుష్కరిణిలో పంచమీతీర్థం చక్రస్నానం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, విజివో సదాలక్ష్మి, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్య ప్రతీకలు స్త్రీల స్వీయ చరిత్రలు

● పోపూరి స్మారకోపన్యాసంలో ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



ప్రొఫెసర్ కాత్యాయని విద్మహేను సన్మానిస్తున్న రచయిత్రి ఓల్గా, ప్రొఫెసర్ మధుజ్యోతి, యువశ్రీ, సుభాషిణి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్త్రీలు రాసిన స్వీయ చరిత్రలు సామాజిక చైతన్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని కాకతీయ యూనివర్సిటీ తెలుగు రిటైర్డు ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో బుధవారం పోపూరి వెంకటసుబ్బారావు స్మారక ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. తెలుగు సాహిత్య, సామాజిక చరిత్ర స్త్రీల చరిత్రతో ముడిపడి ఉందన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం మొదలు విప్లవ, దళిత, ప్రాంతీయ, మైనారిటీ వాద ఉద్యమాలనూ స్త్రీ దృక్కోణం లేకుండా పరిశీలించలేమని స్పష్టం చేశారు. అయితే, స్త్రీల ప్రతిభ, కృషి, త్యాగం మరుగున పడ్డాయనీ, ఇందుకు నేటికీ సమాజంలోని పురుషాధిపత్య భావజాల ఆధిక్యతే కారణమని అభిప్రాయపడ్డారు. సమాజాన్నీ, సాహిత్యాన్నీ స్త్రీ కోణంలో నుంచీ పరిశోధన చేపట్టవలసిన అవసరం ఉందని సూచించారు. రచయిత్రి ప్రతిమ మాట్లాడుతూ.. విద్యకు దూరంగా నెట్టివేయబడిన స్త్రీలు ఆయా రంగాల్లో ఎదిగి స్వీయ చరిత్రలు రాయడం అంత తేలికైన విషయం కాదని అన్నారు. రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ.. విద్య ద్వారానే స్త్రీ చైతన్యం, స్త్రీల అభివృద్ధి, స్త్రీ సాధికారత సాధ్యమవుతాయని అన్నారు. డీన్ ప్రొఫెసర్ వాణి మాట్లాడుతూ.. తెలుగు విభాగం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో విశేష కృషి చేస్తూ ఉందని తెలిపారు. సభాధ్యక్షత వహించిన తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా తన తండ్రి పోపూరి వెంకటసుబ్బారావు స్మారకోపన్యాసం నిర్వహించేందుకు రచయిత్రి ఓల్గా అందిస్తున్న తోడ్పాటును అభినందించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ దొమ్మరాజు యువశ్రీ సభలో ప్రసంగించారు. 'స్త్రీ-సామాజిక భద్రత' అనే అంశంపై నిర్వహించిన కథల పోటీలో విజేతలు వాణిశ్రీ, గీతాంజలి, బాలకృష్ణలకు బహుమతులను అందజేశారు.

తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న అంతర్ జిల్లా ముఠా అరెస్టు

● 1990 గ్రాములు స్వాధీనం.. మూడు కేసులు నమోదు



తిరుపతిలో వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్సు, తిరుపతి అర్బన్ ఎక్సైజ్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. వారి నుంచి 1990 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఎక్సైజ్ అర్బన్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర తెలిపిన ప్రకారం.. ఎంఆర్‌పల్లికి చెందిన చింతగుంట చైతన్య గణేష్, అవిలాల శానప్పకాలనీకి చెందిన మంగళకుమార్, అవిలాలలో ఉంటున్న టి.రాంబాబు, ఎస్‌టీవీ నగర్‌కు చెందిన పాల్‌రాజ్, కడప పట్టణం కందిపాలేనికి చెందిన కొయ్య సోమశేఖర్, పుల్లూరుకు చెందిన గోవిందు జ్ఞానేష్, పక్కీర్‌పల్లికి చెందిన ఎన్.సుబ్బరాయుడు ఒక ముఠాగా ఏర్పడ్డారు. కొన్నేళ్లుగా వీరు గంజాయిని కొని తిరుపతికి తీసుకొస్తున్నారు. శివారు ప్రాంతాల్లో స్టాకు పెట్టి వాటిని పొడి చేసి చిన్న, చిన్న పొట్లాలుగా ప్యాక్ చేయిస్తున్నారు. ఇలా ఐదు గ్రాములు, 10 గ్రాములు, 15 గ్రాములు, 25 గ్రాముల పొట్లాల్లో ఉంచి విక్రయిస్తున్నారు. వీరి కోసం ఎక్సైజ్ ఈఎస్, టాస్క్‌ఫోర్సు అధికారులు కొద్ది రోజులుగా నిఘా ఉంచారు. కడప, తిరుపతి, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు అధికారులకు సమాచారం వచ్చింది. జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లి రెడ్డి, ఏఈఎస్ వాసుదేవ చౌదరి ఆదేశాల మేరకు ఈఎస్ టాస్క్ టాస్క్‌ఫోర్స్ సీఐ శ్యామ్‌ప్రసాద్, ఎస్ఐ ఎస్.స్వామినాథన్, అర్బన్ సీఐ రామచంద్ర, ఎస్ఐ జయశంకర్, మహేష్, నరసింహ, హరికృష్ణ, సిబ్బంది బృందాలుగా విడిపోయారు. ఎంఆర్‌పల్లి శాంతిరనగర్ వద్ద విక్రయిస్తున్న ఇద్దరిని, మంగళం వద్ద మరో ఇద్దరిని, తిరుమలరెడ్డినగర్‌లో ఒకరిని అరెస్టు చేశారు. వారి నుంచి 1990 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని మూడు కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామచంద్ర చెప్పారు.



శ్రీవారి సుప్రభాత సేవలో నటి జ్యోతిక

తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీ నటి జ్యోతిక బుధవారం దర్శించుకున్నారు. వేకువజాము సుప్రభాతసేవలో ఆమె పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది ఆమెకు ప్రత్యేక దర్శనంతో పాటు లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు జ్యోతికను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించింది. రూ.3.53 కోట్లు లభించినట్లు బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 64,525 మంది శ్రీవారిని దర్శించుకోగా, 19,880 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీకాళహస్తిలో తమిళ హాస్య నటుడు యోగిబాబు



శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం తమిళ హాస్య నటుడు యోగిబాబు దర్శించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

హైదరాబాదు నుంచి శబరిమలైకి రేణిగుంట మీదుగా 18 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు27(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు, కాచిగూడ నుంచి కొట్టాయం వరకు డిసెంబరు 3 నుంచి రేణిగుంట మీదుగా 18 ప్రత్యేక రైళ్ళు నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాదులో ఈ ప్రత్యేక రైళ్ళు(07135) డిసెంబరు3, నుంచి 10,17, 24, 31తేదీల్లో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి బేగంపేట, వికారాబాదు, తాండూరు, రాయచూర్, గుంతకల్లు, రాజంపేట, రేణిగుంట,కాట్పాడి, కోయంబత్తూరు, పాల్‌కాడ్, ఎర్నాకులంటౌన్ మీదుగా మరుసటి రోజు 4.10 గంటలకు కొట్టాయానికి చేరుకుంటాయి. ఈ ప్రత్యేక రైళ్ళు (07136) డిసెంబరు 4 నుంచి (ప్రతి గురువారం) 11, 18, 25, జనవరి ఒకటవ తేదీల్లో రాత్రి 11.45 గంటలకు కొట్టాయంలో బయలు దేరి వచ్చిన మార్గంలోనే మరుసటి రోజు హైదరాబాదుకు చేరుకుంటాయి.

● కాచిగూడలో ఈ ప్రత్యేక రైళ్ళు(07133) వచ్చే నెల 5, 12, 19, 26 తేదీల్లో(ప్రతి గురువారం) మధ్యాహ్నం 3.40 గంటలకు బయలుదేరి షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, కర్నూలు సిటీ, రాజంపేట, రేణిగుంట,కాట్పాడి, అలువ, ఎర్నాకులంటౌన్ మీదుగా మరుసటి రోజు సాయంత్రం 6.50గంటలకు కొట్టాయానికి చేరుకుంటాయి. కొట్టాయంలో ఈ ప్రత్యేక రైలు(07134) డిసెంబరు 6, 13, 20, 27 తేదీల్లో రాత్రి 8.30 గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో మరుసటి రోజు రాత్రి 11.40 గంటలకు కాచిగూడకు చేరుకుంటాయి.

పలు ప్రత్యేక రైళ్లు పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి అకోల, పూర్హా, సికింద్రాబాదు మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను డిసెంబరు 6 నుంచి 30వ తేదీవరకు రాకపోకలు సాగిస్తాయని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

● తిరుపతి-అకోల మధ్య నడిచే ప్రత్యేక రైలు ప్రతి శుక్రవారం తిరుపతిలో.. ప్రతి ఆదివారం అకోలలో బయలుదేరుతుంది.

● పూర్హా- తిరుపతి మధ్య నడిచేరైలు పూర్హాలో ప్రతి సోమవారం బయలు దేరుతుంది. ఇదే రైలు తిరుపతిలో ఈ రైలు ప్రతి మంగళవారం బయలుదేరుతుంది.

● తిరుపతి-సికింద్రాబాదు మధ్య నడిచే రైలు, తిరుపతిలో ప్రతి ఆదివారం బయలుదేరుతుంది. ఇదే రైలు సికింద్రాబాదులో ప్రతి సోమవారం బయలుదేరుతుంది.

కదిరిదేవరపల్లి- గుంతకల్ మధ్య ప్యాసింజరు రద్దు

తిరుపతి- కదిరిదేవరపల్లి మధ్య రోజువారీగా రాకపోకలు సాగిస్తున్న ప్యాసింజరు రైలు డిసెంబరు ఒకటి నుంచి 31వ తేదివరకు కదిరిదేవరపల్లి-గుంతకల్ మధ్య తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి





పొలంలో రమణయ్య మృతదేహం - రమణయ్య(ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.... గ్రామానికి చెందిన ఇలకా రమణయ్య(58) బుధవారం ట్రాక్టర్‌కు కేజీ వీల్స్ తగిలించుకుని పొలంలో అడుసు దున్నుతున్నాడు. ఈ సమయంలో విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటర్‌కు సరఫరా చేసే తీగలు ట్రాక్టర్ సైలెన్సర్‌కు తగిలాయి. దీంతో షాక్‌కు గురైన రమణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిగ్‌బాస్ ఫేం ప్రియాంకపై చర్యలు తీసుకోండి

తిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఆదరణ పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో భక్తులను భయాందోళనకు గురిచేసేలా 'తిరుపతి దారిలో మాపై చిరుతపులి ఎటాక్ చేసింది' అంటూ ప్రాంక్ వీడియో చేసిన బిగ్‌బాస్ ఫేం ప్రియాంక, ఆమె స్నేహితుడు శివపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీటీడీ సభ్యుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. ఈ మేరకు ఆయన తిరుమల డీఎస్పీకి లేఖ రాశారు. కొద్దిరోజుల క్రితం ప్రియాంక, శివ అలిపిరి కాలినడకమార్గంలో చేసిన ఈ వీడియోపై ఆయన స్పందిస్తూ ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలన్నారు. ఇదే అంశంపై ఇప్పటికే టీటీడీ సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి కూడా స్పందించిన విషయం తెలిసిందే. టీటీడీ విజిలెన్స్ నుంచి ఫిర్యాదు అందిన తర్వాత కేసు నమోదు చేయాలని పోలీసులు భావిస్తున్నట్టు సమాచారం. ఈప్రాంక్ వీడియోపై ఇప్పటికే వార్తలు రావడంతో సోషల్ మీడియా ఖాతాల నుంచి డిలీట్ చేసినట్టు తెలుస్తోంది.